# నా జీవితము

**'సత్యంవద'**

**'ఈలోకంలో పురుషులకూ స్త్రీలకూ తేడాలేదు. ఒకరినొకరు బాధించుకోనడంలేదు. అంతా సహకారం, ప్రేమా–జీవితమంతా స్పర్ధలులేకుండాపోతోవుంటుంది. నువ్వు కొత్తగా వచ్చినట్టున్నావిక్కడకు' అంది. ఆమెమాటలు వినేటప్పటికి ఒకవిధమైన ఆనందంవచ్చి ఆమెను ఆలింగనంచేసుకొన్నాను.**

స్థావరజంగమ ప్రకృతి సన్నిభమైన యీ ప్రపంచంలో జీవాణువులన్నీ రెండురకములైన ప్రకృతులు కలవి. స్త్రీ ప్రకృతి, పురుష ప్రకృతి. సృష్టికి ఆధారభూతములైన ఈ రెండు ప్రకృతులలో ఒక ప్రకృతిని నేను... నేను స్త్రీని.

ఆ రోజుల్లో మా నాన్నగారు శాకుంతల నాటకం చదువుతూ 'ప్రియంవద' అనే పేరుచూచి, నాకు 'సత్యంవద' అని పేరుపెట్టారు. ఇప్పుడు నాకు పందొమ్మిదేండ్లు నిండాయి. స్త్రీనయి పుట్టడంచేత, నాకీ వయస్సునకప్పుడే సంభవించిన దురవస్థలు సంఘంయెదుట పెట్టడం నా విధి......

ఆ పెండ్లిపీటలమీద కూర్చోడానికి ముందు జరిగిన కులాసాజీవితము ఒక విహంగజీవితంవలె తారా గగనంలో స్వేచ్ఛగా విహరించింది. పెళ్లి అయినప్పటినుంచీ నాకు తెలియని ఒకానొక చెరలో పడ్డాను. అది సుఖప్రదమైన చెర అని పుస్తకాలలో ఉద్ఘాటింపబడినా, నాకుమాత్రం ఆ సౌఖ్యమేమిటో గోచరించలేదు, ఊహించనూ లేను.

ఆనాడు ఒకాయన నా మెడలో బంగారపు గొలుసూ, శంఖాలతావళమూ వేస్తే, నగలెరగని నా సువర్ణకాంతుల శరీరం నిగనిగ లెక్కువై ఊర్వశీరూపమును నాకు ప్రసాదించినది. ఆ నూతనవస్త్రాల్లో నా దేహసౌష్టవము నవోదయ మేఘాకాశంలోని మెరుపుకళలవలె తళతళలు విరిసింది. అంతటితోసరి— నాగళసీమయందు కనకహారములు విసరిన యీ దివ్యపురుషుడెవరో నేనాసమయంలో యెరుగను. తరువాత ఒక యేడాదికి తెలిసినది, ఆ దివ్యపురుషుని దివ్యచరిత్రం—

ఆయన ఒక భూస్వామిట, కుబేరుడట. ఆయన సదా వెలయాండ్రతో విటగృహాల్లో కేళీవినోదములతో నిరంతరమూ జీవితమును తనుపుతూవుంటాడట—

ఇవన్నీ వ్రాస్తోవుంటే నాకొక వెర్రినవ్వు వస్తుంది. ఆహా,—ఆయన ఈ రెండో పెండ్లి యెందుకు చేసుకోవాలి? నా గొంతుక యిట్లా యెందుకు కత్తిరించాలి? ఈ దౌర్బల్యమైన సంఘం అతనిచేత నా మెడకు,—నా అవ్యక్తదశలో—వేయించిన మూడు ముళ్లూ, మూడు ఉరిత్రాటి ముళ్లై నా కంఠపు ముడిని బిగించేశాయి. మొగ్గలోనే శుష్కించిపోయిన నా జీవితం, మాధుర్య పరిమళాలను వెదజల్లవలసిన

యీ నా యవ్వనవయస్సులో మోడైపోయింది. మృదులమై, స్వాదువై పల్లవించే నాహృదయం యింతలోనే ఈ నిశీథంలో, శ్మశానవాటికల్లో, తలలు విరబోసుకొని ఎందుచేత తాండవించవలసివచ్చింది.

నా ఆవేదనలో అసలు కథ వ్రాయడం మరిచిపోతున్నాను—ఆ ధనవంతుడైన నా భర్త నన్ను—మొదటిభార్య చచ్చిపోయినమీదట—భార్యగా స్వీకరించాడు (నా తండ్రి యనుజ్ఞమీద.) ఆయనకున్న అప్పులు మా నాన్నకు అంతగా తెలియవు కాని, ఆయనకున్న జారత్వగుణము తెలుసును.

పునస్సంధానమైనతర్వాత అత్తవారియింటికి తీసికొనిపోబడ్డాను—అది ఒక చక్కని మేడ—అది తణఖాలో ఉన్నట్లు యిటీవల తెలియవచ్చింది—మా పడకలు మొదటి పదిరోజులూ చక్కని పడకగదిలోనే జరిగినవి తరువాత కొన్నిరోజులపాటు ఆయన ఎక్కడికో వెళ్లి రాలేదు—ఎక్కడకు వెళ్లారు? చెబుతా—

నావంటి యింకొక స్త్రీ ప్రకృతివద్దకు—ధనమునకు తన దేహమూ, మానమూ అమ్మకొన్న వెలయాలు వద్దకు—

రోజులు గడిచినవి - వారములు గడిచినవి - నెలలూ గడిచినవి - ఇంటిజాడలేదాయనకు - కొత్త కోడలును కనుక యింట్లో ఏదో కొత్తగా కాలక్షేపం చేస్తున్నాను. కూర్చుంటే నించోలేని, నించుంటే కూర్చోలేని మా అత్తగారొకావిడ వుంది. మా ఆయనకు అప్పులెక్కువ అగుటచేత కోమటికూడా సరుకులు పద్దుమీద యివ్వడానికి నిరాకరించాడు మాదగ్గిర డబ్బేదీ? మా ఆడబడుచు భర్త - ఒక సామాన్య కుటుంబీకుడు - తన పేరుమీద కోమటింటినుంచి ఉప్పూ, మిరపకాయలూ, బియ్యం వగైరాలు తెప్పించియిస్తేనే కాని గత్యంతరం లేకపోయేది. యీ విషయాలనుగురించి, నా జీవద్భర్తకు కొన్నాళ్లు ఉత్తరాలు వ్రాసేదాన్ని. ఎన్ని ఉత్తరాలు వ్రాస్తే ఏమి ప్రయోజనము? తరువాత మూడునెలలకు ఒకసారి వచ్చారు. ఈ అభాగిని జ్ఞాపకంవచ్చికాదు - తల్లిమొర వినడానికీకాదు - అని తరువాత తరువాత తెలియవచ్చింది నాకు—

ఆయనయొక్క అప్సరః ప్రణయినికి ధనమనే ప్రేమ నిరంతరంచూపిస్తోవుంటేనే కాని కబరీచ్యుత పుష్పమాలా సౌరభంకూడా ఆయనకు దక్కనియ్యదట. ఆయన ఆస్తిఅంతా అమ్మివేసి ఆమెకొక చక్కని మేడ కట్టించారు - అయినా ఇది వారికొక శాశ్వతబంధంకాదట - ఈ విషయం తెలుసుకుని నేను చాలా ఆనందించాను - కాని విచారంకూడా కలిగింది—ఒక స్త్రీ తన దేహాన్నీ, మనస్సునూ, ఎల్లాగ సర్వనాశనం చేసుకుంటూందో అని పెద్ద విచారం నాకు - ఆరోగ్యము మొదటికే నష్టంకదా - మొన్ననే భారతిలో "మరతుమన్న మరపురారు" అనే కథనుకూడా చదివాను. ఈ కులటల జీవితాల్ని తలుచుకుని ఖేదపడ్డాను.

సరే వచ్చారు. ఆముఖం రుసరుసలాడుతూవుంటుంది నన్ను చూశాటప్పటికి. తల్లితో మౌనం. నాతోనూ యించుమించు అంతే - భోజనము యీకవాకిట్లో మడత మంచంమీద పడుక్కున్నారు మండువాలో చీర కొంగు పరుచుకుని గాలి చప్పుడుకు అదరిపడుతూ, దీపపుకాంతిలో చీకటిషాగలు చూస్తూ వెర్రి ఆలోచనలతో మేలుకొని పడుక్కున్నాను. ఎప్పుడు పట్టిందోకునుకు - ఎరగను - వీధిలో తాళాలచప్పుడూ, పాటలూ వినవచ్చాయి. అప్పుడే తెల్లవారగట్ల అయిందనుకుని లేద్దామనుకుంటూనే మళ్లీ రెప్పవాల్చాను ఒక చక్కని కల—'నేనొక క్రొత్త ప్రపంచంలో ఉన్నాను. అక్కడ అందరూ స్త్రీలే. ఒకావిడమాత్రం కుర్చీలో కూర్చుంది. ఒకావిడ నించుని మాట్లాడుతోంది. అక్కడున్న అందరికళ్లల్లోనూ, ముఖంలోనూ జీవకళలుట్టి

పడుతున్నాయి. చక్కని ఆరోగ్యముతైన శరీరాలు - నవ్వుముఖాలతో ఆమె చెప్పేమాటలు వింటున్నారు. ఏదో దేశసేవనుగురించి మాట్లాడుతోంది ఆమె. వాళ్లనిచూచి వీళ్లందరికీ భర్త లెక్కడున్నారో అనుకున్నాను. ఒకామె నన్నుచూచి - 'ఏంచెల్లాయీ అల్లాచూస్తావు' అంది. 'ఏమిటీ లోకం అన్నాను'—'ఈ లోకంలో పురుషులకూ స్త్రీలకూ తేడాలేదు. ఒకరినొకరు బాధించుకోనడంలేదు. అంతా సహకారం, ప్రేమా. జీవితమంతా స్పర్థలులేకుండా పోతోవుంటుంది. నువ్వు కొత్తగా వచ్చినట్టున్నావిక్కడకు' అంది. ఆమెమాటలు వినేటప్పటికి ఒకవిధమైన ,ఆనందంవచ్చి ఆమెను ఆలింగనం చేసుకొన్నాను. ఇంతలో మా అత్తగారి కేక వినబడి ఉలికిపడిలేచాను. చేతులు నేలను గట్టిగా అదుముకుని ఉన్నాయి.

ఆయనకు చెంబూనీళ్లు యిచ్చాను. కలలోని ఆనందంనన్నావరించుకునేవుంది. ఆ స్వప్నంలోనే ఎందుకు ఉండకపోయానా అనిపించింది. నాకు శక్యమా ? మరునాడుకూడా మేము-దంపతులము-మాట్లాడుకోలేదు. మూడవనాడు ఆయనంతట ఆయనే నవ్వుతో మాట్లాడారు. మహాపురుషుల నవ్వులో అర్థం వుండక పోదు. ఆనవ్వునన్ను దీనాతిదీనంచేసి వదలిపెట్టింది ప్రపంచంలో.

ఈమాటా, ఆమాటా చెప్పి నీకు మెడలో పుస్తెలతాడుచేయిస్తానంటూ కంసాలిని రప్పించి, నా మెడలో అదివరకున్న మూడున్నరకాసులబంగారం నా యెదుటనే అతనిచేతుల్లోపెట్టి వస్తువుపురమాయించారు. ఈ తెలివితక్కువ స్త్రీకి నగలంటే ఎంత ఆనందమో - స్వర్గలోకంలో ఉన్నట్లే అనిపించింది. తెల్లవారగట్ల వచ్చిన కలలు వృథాగాపోవు అనుకున్నాను. అటుతరువాత మరునాటిసాయంత్రం నాకొక ఐదు రూపాయలనోటిచ్చి, రాజమండ్రి వెడుతున్నానని చెప్పి ఆయన ఎక్కడికో వెళ్లిపోయారు.

ఇంక నాలుగురోజులకు పుస్తెలతాడు అయిందేమో అని కంసాలికి కబురుచేశాను. తయారయిందిట కాని వారువస్తే కాని విడుదల చెయ్యడట. కబురుచేద్దామంటే ఎక్కడున్నారో-ఏమంటారో-స్వతంత్రురాలను కాదాయెను.

కొన్నిరోజులకు మనిషి వాడిచేతికి ఉత్తరమొకటియిచ్చి కంసాలికి కబురుచేశారట. ఏమని ? ఆ పుస్తెలతాడు వానిచేతికిమ్మని. ఇంకేంగతిరా దేవుడా ? డబ్బు తినివున్న కంసాలి ఆయన కాగితాన్ని తిరస్కరించలేకపోయాడు. ఈ సమయంలో నా హృదయం ఎల్లావుంటుందో సోదరీమణులకే తెలవాలి.

అయినకాటికి ఆస్తిఅంతా పాడుచేసె, యిల్లు తణఖాపెట్టె, తినడానికి కూడూ కట్టుకోడానికి గుడ్డా లేవు. బిచ్చమెత్తుకునైనా బ్రదుకుదామంటే భర్త దగ్గిరలేని సువాసినిని సంఘం బహిష్కరిస్తుంది. నానా మాటలూ అంటుంది. ఈసడిస్తుంది. సంఘం వట్టిరాయి. దానికి హృదయం శూన్యం. ఇట్టి సంఘం నాకు బహిష్కృతం. యీ సంఘంయొక్క హృదయపాషాణం కరిగిపోవడానికి నాలాంటివాళ్ల అశ్రుకణాలు ఎన్ని కావాలో...!

## అభినందనము

శ్రీయుత మద్దాలి ఉమామహేశ్వరరావుగారు

గృహలక్ష్మీకృత కంకణ బహూకృతికి నెల్లఁదగిన పడఁతివి నీవే
గృహలక్ష్మివనిన నీవే సహనమొసంగెడు పలుకుల చానవు నగుటన్.